


పన్ను వసూళ్లలో ముందంజ

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో రూ.30కోట్ల మేర ఆస్తిపన్నులు వసూలు కాగా, ఒకేరోజు రూ.2.11కోట్లు రాబట్టారు. 8లో




అందాల అడ్డా.. మోతెగడ్డ

బూర్గంపాడు మండలంలోని మోతెగడ్డ ప్రకృతి అందాలకు నిలయంగా ఉన్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రత నమోదవుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీచే అవకాశముంది.



రణరంగం..



సీఐపై దాడి చేస్తున్న గిరిజనులు

దశాబ్దాలుగా కొనసాగుతున్న పోడు వివాదం చినికిచినికి గాలివానలా మారింది. స్థానికులు, స్థానికేతరుల నడుమ జరుగుతున్న ఘర్షణను అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై దాడి చేయడం సంచలనం సృష్టించింది. సీఐ సహా కానిస్టేబుళ్లపై గిరిజనులు దాడి చేయగా.. ఆతర్వాత అదనపు బలగాలను రప్పించి పరిస్థితిని అదుపు చేయాల్సి వచ్చింది. ఈ ఘటనకు కారకులైన సూత్రధారుల కోసం పోలీసులు గాలిస్తుండగా.. ప్రత్యక్షంగా పాల్గొన్న 19మంది మహిళలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సత్తుపల్లి మండలం చంద్రాయపాలెం అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు చోటుచేసుకున్న ఈ ఘటనలతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. – సత్తుపల్లి

చంద్రాయపాలెంలో పోలీసులపై గిరిజనుల దాడి

- కొన్నేళ్లుగా సాగుతున్న పోడు వివాదం
- స్థానికులు, స్థానికేతరుల ఘర్షణను అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులు
- సర్దిచెబుతుండగానే సత్తుపల్లి సీఐ సహా కానిస్టేబుళ్లపై దాడి
- 19మందిని రిమాండ్. సూత్రధారుల కోసం గాలింపు
- పోలీసు పికెట్ ఏర్పాటుతో చంద్రాయపాలెం, బుగ్గపాడుల్లో ఉద్రిక్తత



సత్తుపల్లి సీఐ కిరణ్, కానిస్టేబుళ్లను చుట్టుముట్టి దాడి చేస్తున్న గిరిజనులు

ఏమిటీ వివాదం

చంద్రాయపాలెం గిరిజనులకు.. స్థానికేతర గిరిజనులకు దశాబ్దాలుగా పోడు వివాదం జరుగుతోంది. అయితే, చంద్రాయపాలెంలో పూర్వ కాలం నీళ్ల లేక చాలా మంది ఊరు విడిచి చుట్టు పక్కల గ్రామాల్లో స్థిరపడ్డారని చెబుతారు. 1970 గెజిట్ తర్వాత అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చంద్రాయపాలెం గిరిజనులకు భూమి హక్కులు కల్పించారని వాదిస్తున్నారు. కాగా ఆందోళన చేస్తున్న రుద్రాక్షపల్లి, బుగ్గపాడు, కాకర్లపల్లి, గాంధీనగరం గ్రామాల గిరిజనులు తమ పూర్వీకులు 50 ఏళ్లకు ముందు చంద్రాయపాలెంలోనే నివాసం ఉండేవారని చెబుతున్నారు. ఇందుకు సంబంధించి పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయని అంటున్నారు. ఇందులో భాగంగానే వారు భూములను తమకు పంచి ఇవ్వాలని కోరుతుండగా చంద్రాయపాలెం గిరిజనులతో ఘర్షణలు జరుగుతున్నాయి. అయితే, సర్వే చేసి రికార్డుల ఆధారంగా భూమి పంచే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని స్థానికేతర గిరిజనులు తేల్చి చెబుతుండడంతో వివాదం ఎటూ తేలడం లేదు.

19 మంది మహిళలు రిమాండ్

చంద్రాయపాలెం పోడు వివాదంలో సత్తుపల్లి సీఐ టి.కిరణ్, పోలీసులపై దాడి ఘటనలో 19 మంది మహిళలను అరెస్ట్ చేసి ఆదివారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే, మరికొందరు పరారీలో ఉండగా గాలిస్తున్నట్లు చెప్పారు. అయితే, వివాదంలో ముఖ్య భూమిక పోషించిన మద్దిశెట్టి సామేలు, కూరం మహేంద్ర కోసం గాలింపు ముమ్మరం చేశామని ఏసీపీ రఘు తెలిపారు. అయితే, జిల్లా సరిహద్దుల్లోని నాయకన్‌గూడెం చెక్‌పోస్టు వద్ద మద్దిశెట్టి సామేలును టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నా, పోలీసులు మాత్రం ధృవీకరించలేదు. తొలుత వారు సత్తుపల్లిలోని రాజకీయ నాయకుల ఇళ్లల్లో తలదాచుకున్నారనే సమాచారంతో పలువురి ఇళ్లలోనూ సోదా చేశారు.



దాడిలో గాయపడిన గిరిజన మహిళలు



ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

జామాయిల్ సాగు.. లాభాలు

చంద్రాయపాలెంలోని 400 హెక్టార్లలో 1986 నుంచి వీఎస్ఎస్, అటవీశాఖ సంయుక్త సంరక్షణలో సీడ్ ఆర్జన్ కింద జామాయిల్ సాగు చేస్తున్నారు. 1999లో పాండ్ల సుబ్బాలు, మరికొందరి పేర్లపై అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ చెట్టుపట్టా ఇచ్చినట్టు చంద్రాయపాలెం గిరిజనులు రికార్డు చూపిస్తున్నారు. ఇందులో 135 ఎకరాలకు గాను 25 మందికి ఐదు ఎకరాల చొప్పున వైఎస్సార్ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం కింద పోడు పట్టాలు మంజూరు చేసింది. అయితే వనసంరక్షణ సమితి(వీఎస్ఎస్), అటవీశాఖ ఆధ్వర్యాన ఆ భూముల్లో జామాయిల్ సాగు చేసి 2004లో మొదటి కోత తీసి గిరిజనులు లాభాలను ఆర్జించారు. ఇటీవలే పది హెక్టార్లలో రెండో కోత చేపట్టగా.. చంద్రాయపాలెం గిరిజనులు సగం వాటా లాభం పంచుకున్నారు. ఇది కూడా స్థానికేతర గిరిజనుల కోపానికి కారణమైనట్లు తెలుస్తోంది.

2009 నుంచి..

2009 నుంచి పోడు వివాదం వివిధ దశల్లో కొనసాగుతోందని స్థానికేతర గిరిజనులకు నేతృత్వం వహిస్తున్న కూరం మహేంద్ర, నాగమణి తెలిపారు. తమ ముత్తాతల కాలం నాటి భూమిని ఇవ్వాలని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 400 కుటుంబాలు ఆందోళనలో పాల్గొంటున్నాయి. ఈవిషయమై 2022లో కూరం మహేంద్ర మానవ హక్కుల కమిషన్‌లో పిటీషన్ వేస్తే 2023లో సర్వే చేయమని ఆదేశాలు వచ్చాయని సమాచారం. దీంతో అటవీ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేసి తమ భూములను ఇప్పించాలని ఎన్నో సార్లు విజ్ఞప్తి చేయడమే కాక ఆందోళనలు, ధర్నాలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో భూముల స్వాధీనానికి వారే స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

పోలీసులపై తిరుగుబాటు

చంద్రాయపాలెం భూముల వివాదం తీవ్రమవుతోందని ముందుగానే పోలీసులు గుర్తించగా.. అటవీ ఉద్యోగుల ఫిర్యాదుతో స్థానికేతర గిరిజనులకు నేతృత్వం వహిస్తున్న మహేంద్రను శనివారం సత్తుపల్లి పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. భూములకు సంబంధించి రికార్డులను ఇరువర్గాలు చూపించాలని.. అప్పటి వరకు భూముల్లోకి వెళ్లకూడదని సీఐ టి.కిరణ్ సూచించి ఆయనను పంపించేశారు. ఇంతలోనే ఆదివారం ఉదయమే అటు స్థానికులు, ఇటు స్థానికేతరులు భూమిలోకి వచ్చి ఘర్షణ పడుతున్నారనే సమాచారంతో ఎస్సై రాజు, ముగ్గురు పోలీస్ సిబ్బందిని పంపించారు. కానీ పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం లేదని తెలియడంతో సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో వెళ్లారు. అక్కడ కనిపించిన మహేంద్రను పిలిపించి మాట్లాడుతుండగానే గిరిజనులంతా ఆగ్రహంతో సీఐ కిరణ్‌ను చుట్టుముట్టి పిడిగుద్దులతో దాడి చేశారు. అక్కడే ఉన్న కానిస్టేబుళ్లు పి.నర్సింహారావు, ఇమ్రాన్, సత్యనారాయణ, నరేష్ కలిసి సీఐని కాపాడుకునే ప్రయత్నంలో రక్షణ కవచంలా నిలిచి పోలీస్ వ్యాన్ వైపు తీసుకొస్తుండగా గిరిజనులు కర్రలతో వెంబడించి మరీ దాడి చేయడం గమనార్హం. ఆతర్వాత కల్లూరు ఏసీపీ రఘు నేతృత్వాన సత్తుపల్లి టౌన్, సత్తుపల్లి రూరల్ సీఐలు టి.కిరణ్, వెంకటేశం, డివిజన్‌లోని ఎస్సైలు, సిబ్బంది చేరుకోగా.. గిరిజనులు ప్రతిఘటించటంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఆపై పోలీసు బలగాలతో పికెట్ ఏర్పాటుచేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, గిరిజనులను అదుపులోకి తీసుకునే సమయాన జరిగిన తోపులాటలో పలువురు గిరిజన మహిళలకు కూడా గాయాలయ్యాయి.

న్యూస్‌రీల్

'నవోదయ' ఫలితాలు విడుదల

కూసుమంచి: కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. విద్యాలయ సమితి ఆదివారం ఫలితాలను విడుదల చేసిందని అధికారులు తెలిపారు. పాఠశాలలో 80 సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహించగా అర్హత సాధించిన వారి రోల్ నంబర్లను కేటగిరీల వారీగా సోమవారం ప్రకటిస్తామని వారు ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న అశోక్

ఖమ్మం సహకారనగర్: కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత పరిస్థితిలో టెట్ అర్హత లేకుండానే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, విద్యారంగానికి బడ్జెట్‌లో 20శాతం నిధులను కేటాయించడంతో పాటు బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ డీఏలు విడుదల చేయటంతో స్పాట్ రెమ్యూనరేషన్ పెంచాలని, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలన్నారు. ఈసమావేశంలో వి.మనోహర్‌రాజు, ఎస్.విజయ్, ప్రసాదరావు, ముత్తయ్య, వీరబాబు, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

సెలవులో డైట్ ప్రిన్సిపాల్

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ రెండు నెలల పాటు సెలవులో వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో ఇంగ్లిష్ లెక్చరర్ బాలమురళికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఒకటి, రెండు రోజుల్లో డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సి పాల్ నియామకంపై అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశముంది.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. గర్భగుడిలో ప్రత్యేక పూజల అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా పూర్తిచేశారు.

అష్టకష్టాల్లో అన్నదాత

- రైతు బంధు రాక, నీళ్లు లేక ఎండిన పంటలు
- ఎంపీలు నామా, వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ



ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న ఎంపీలు నామా, వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ మధు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: కేసీఆర్ అంటేనే కాల్వలు, చెరువులు, నదులు అని.. ఆయన లేకపోతే నీటి ఎద్దడి వస్తుందని అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపించిందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నీటి యాజమాన్యం తెలియక, రిజర్వాయర్లు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడంతో ప్రజలు, రైతులు అల్లాడుతున్నారని తెలిపారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో నామా, పువ్వాడ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే వచ్చిన కరువుగా దీన్ని గుర్తించాలన్నారు. కాంగ్రెస్ రైతులకు రైతు బంధు ఇవ్వకపోగా.. సాగునీరు సమకూర్చకపోవడంతో అన్నదాతలపై కోలుకోలేని దెబ్బ పడిందని చెప్పారు. ఇకనైనా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలు చూస్తుంటే బాధ వేసిందని, కాంగ్రెస్‌కు ఓటు వేసి బాధ అనుభవిస్తున్నామని రైతులు చెప్పారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మరోసారి తప్పు చేయకుండా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఎంపీ నామ తెలంగాణ కోసం పార్లమెంట్‌లో పోరాడారని, ఎంపీగా నిధులు సాధించినందున మరోమారు గెలిపించాలని పిలుపునిచ్చారు.

సాగర్ జలాలతో పాలేరు నింపాలి

కూసుమంచి/నేలకొండపల్లి: గతంలో ఎన్నడూ లేని విధంగా పాలేరు రిజర్వాయర్‌ను ఎండబెట్టారని, ప్రభుత్వం, జిల్లా మంత్రుల అవగాహన లేమితో తాగు, సాగునీటి ఇబ్బందులు వచ్చాయని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మండిపడ్డారు. కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ , ఎమ్మెల్సీ తాతా మధు తదితరులతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పాలేరును సాగర్ జలాలతో తక్షణమే నింపి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆతర్వాత నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెంల్లో ఎండిన వరి పొలాలను వారు పరిశీలించారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, మదన్‌లాల్, బానోత్ చంద్రావతి, వనమావెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజతో పాటు వేముల వీరయ్య, శీలంశెట్టి వీరభద్రం, బెల్లం వేణు, చాట్ల పరశురాం, ఆసిఫ్‌పాషా, మల్లీదు వెంకన్న, ఉపేంద్రాచారి, రంజాన్, బాలకృష్ణ, రాము పాల్గొన్నారు.

మందకొడిగానే ఆన్‌లైన్ విక్రయాలు

భద్రాచలం: భద్రాచలంలో కొలువుదీరిన శ్రీ సీతారాముల వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన టికెట్ల విక్రయాలు మందకొడిగానే సాగుతున్నాయి. ఈనెల 17న శ్రీరామనవమి, 18న పట్టాభిషేం మహోత్సవాలు ఉండగా దేవస్థానం వెబ్‌సైట్ https://bhadradritemple.telangana.gov.in ద్వారా టికెట్ల అమ్మకాన్ని మార్చి 25న ప్రారంభించారు. అయితే ఆదివారం సాయంత్రం వరకు.. రూ.7,500 విలువ గల ఉభయదాతల టికెట్లు 750కి 142, రూ.2,500 విలువైన టికెట్లు 590కి 55, రూ. 2వేల టికెట్లు 190కి 33, రూ.వెయ్యి విలువైన టికెట్లు 1185కు 157 మాత్రమే భక్తులు కొనుగోలు చేశారు. వీటితో పాటు రూ. 300 విలువైన టికెట్లు 384, రూ.150 విలువైన టికెట్లు 51 టిక్కెట్లు అమ్ముడుపోయాయని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

నేటి నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా..

కాగా సోమవారం నుంచి ఉత్సవాల వీక్షణ టికెట్లను నాలుగు ప్రత్యేక కౌంటర్ల ద్వారా నేరుగా కూడా విక్రయించనున్నారు. దేవస్థానం వద్ద మెయిన్ టికెట్ కౌంటర్‌తో పాటు తానీషా కల్యాణ మండపంలోని సీఆర్ఓ కార్యాలయం, బ్రిడ్జి పాయింట్ వద్ద నున్న విచారణ కేంద్రం, భద్రాచలం ఆర్డీఓ కార్యాలయం వద్ద కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఆన్‌లైన్‌లో సెక్టార్ టికెట్లను పొందిన భక్తులు సోమవారం నుంచి 17వ తేదీ ఉదయం 7 గంటల వరకు ఒరిజనల్ టికెట్లను పొందవచ్చని అధికారులు తెలిపారు. దీనికి గాను ఒరిజనల్ గుర్తింపు కార్డులను చూపించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

ఎస్సెస్సీ 'స్పాట్'కు సిద్ధం

- 3వ తేదీ నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం
- సెయింట్ జోసఫ్ స్కూల్‌లో క్యాంపు ఏర్పాటు
- జిల్లాకు చేరిన 2.10లక్షల జవాబుపత్రాలు



వాల్యుయేషన్ సెంటర్‌లో పరిశీలిస్తున్న విద్యాశాఖ జేడీ మదన్‌మోహన్

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి పరీక్షలు శనివారం ముగియగా.. అధికారులు జవాబుపత్రాల మూల్యాంకనంపై దృష్టి సారించారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో వాల్యుయేషన్ క్యాంప్ నిర్వహించనుండగా, అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈనెల 3వ తేదీన మొదలయ్యే మూల్యాంకనం కోసం విద్యాశాఖ ప్రత్యేక పరిశీలకుడిని నియమించనుంది. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి చేరిన 2,10,400 జవాబుపత్రాలను కోడింగ్ చేసి భద్రపర్చారు. ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు జరిగే మూల్యాంకనం ఏర్పాట్లను ఆదివారం విద్యాశాఖ సర్వీసెస్ జాయింట్ డైరెక్టర్(జేడీ) మదన్‌మోహన్ పరిశీలించారు. ప్రతిరోజు ఒక్కో ఉపాధ్యాయుడు గరిష్టంగా 40పేపర్లు మాత్రమే మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది.

900 మంది నియామకం

ఎస్సెస్సీ జవాబుపత్రాలు మూల్యాంకనం కోసం 900మంది ఉపాధ్యాయలను నియమించారు. జిల్లాకు ప్రత్యేక పరిశీలకుడిని నియమించనుండగా, వాల్యుయేషన్ క్యాంపు ఆఫీసర్‌గా డీఈఓ ఈ.సోమశేఖరశర్మ వ్యవహరిస్తారు. ఇక ఇద్దరు డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు, ఏడుగురు అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, 100 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 585 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లతో పాటు 200 మంది స్పెషల్ అసిస్టెంట్లు విధుల్లో పాల్గొంటారు. అలాగే, సెంటర్ వద్ద పోలీసులు బందోబస్తు కూడా ఉంటుంది.

ఏర్పాట్లు చేస్తున్నాం



పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది నియామకం పూర్తయింది. 900మంది వరకు ఉద్యోగులు విధుల్లో పాల్గొంటారు. వాల్యుయేషన్ కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. – ఈ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

ఆర్టీసీకి ఆదరణ బాగుంది..

- డిమాండ్‌కు అనుగుణంగా బస్సులు నడుపుతాం
- బస్టాండ్లలో సౌకర్యాల పెంపునకు చర్యలు
- అవసరమైన చోట తాత్కాలిక బస్‌షెల్టర్లు
- అదనంగా 195 బస్సులు, వెయ్యి మంది సిబ్బంది కోసం ప్రతిపాదనలు
- 'సాక్షి'తో ఖమ్మం రీజినల్ మేనేజర్ చెరుకుపల్లి వెంకన్న



సాక్షి ఇంటర్వ్యూ

ఖమ్మంమయూరిసెంటర్: 'కరోనా తర్వాత పరిశీలిస్తే ఇటీవలి కాలంలో ఆర్టీసీకి ఆదరణ పెరిగింది. మహాలక్ష్మి ప్రయాణికులతో పాటు సాధారణ ప్రజలు ప్రయాణానికి ఆర్టీసీ బస్సులనే ఎంచుకుంటున్నారు. ఖమ్మం రీజియన్‌లో ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి ప్రాంతాల నుంచి బస్సులకు మంచి డిమాండ్ ఉంది. ఆయా ప్రాంతాల నుంచి రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లేందుకు కూడా ప్రయాణికులు ఆర్టీసీనే ఆశ్రయిస్తున్నారు. దీంతో డిమాండ్ ఆధారంగా బస్సు నడిపేందుకు చర్యలు చేపట్టాం. వేసవిలో ప్రయాణికుల కోసం అన్ని బస్టాండ్‌లలో వాటర్ కూలర్లు ఏర్పాటు చేస్తున్నాం. చలివేంద్రాల ఏర్పాటు కోసం దాతలను సంప్రదిస్తున్నాం. అలాగే, కొత్త బస్సులు, అదనపు సిబ్బంది కోసం యాజమాన్యానికి ప్రతిపాదనలను పంపించాం' అని ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ చెరుకుపల్లి వెంకన్న తెలిపారు. ఆదివారం 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించిన వివరాలు ఆర్ఎం మాటల్లోనే...

కొత్త బస్సులు నడుపుతున్నాం..

ఖమ్మం రీజియన్‌లో ఖమ్మం నుంచి కోదాడ, భద్రాచలం నుంచి ఖమ్మం, సత్తుపల్లి నుంచి ఖమ్మం, భద్రాచలం నుంచి విశాఖపట్నం, కొత్తగూడెం నుంచి ఇల్లెందుకు బస్సులు నడిపించాలని ప్రయాణికుల నుంచి వినతులు వస్తున్నాయి. దీంతో ఆయా రూట్లలో డిపో మేనేజర్లతో సర్వే చేయించాం. ఇప్పటికే భద్రాచలం నుంచి ఖమ్మానికి త్రీ స్టార్ పేరుతో డీలక్స్ బస్సులు నడుపుతున్నాం. ఈ బస్సులు పాల్వంచ, కొత్తగూడెం, ఏన్కూరుల్లో మాత్రమే ఆగుతాయి. భద్రాచలం నుంచి విశాఖపట్నానికి స్లీపర్ బస్సులు నడిపించాలన్న వినతితో ఇటీవల ప్రారంభించాం. మధిర డిపోకు చెందిన డీలక్స్ బస్సును ఖమ్మం, కోదాడ రూట్‌లో తిప్పుతున్నాం. ఈ బస్సు మార్గమధ్యలో ముదిగొండ, నేలకొండపల్లి స్టేజీల్లో మాత్రమే ఆగుతుండగా.. మంచి ఆదాయం నమోదవుతోంది. ఇంకా సత్తుపల్లి నుంచి వీఎం బంజర, తల్లాడ, వైరాల్లో మాత్రమే ఆగేలా ఖమ్మానికి త్రీస్టార్ పేరుతో డీలక్స్ బస్సు నడిపించనున్నాం.

మరో 195 బస్సులకు ప్రతిపాదనలు

ప్రస్తుతం ఉన్న డిమాండ్ మేరకు ఖమ్మం రీజియన్‌లో అదనంగా 195 బస్సులు, 1000 మంది సిబ్బంది అవసరముంది. ఇందు కోసం యాజమాన్యానికి ప్రతిపాదనలను పంపించాం. ఇటీవల రీజియన్‌కు 20 ఏసీ, నాన్ ఏసీ బస్సులు వచ్చాయి. వీటిని వివిధ డిపోలకు కేటాయించి అవసరమైన రూట్లలో తిప్పుతున్నాం.

ఏసీ బస్సులు రెడీ..

వేసవిలో ఏసీ బస్సులకు డిమాండ్ ఉంటోంది. రీజియన్‌లో మొత్తం 39 ఏసీ బస్సులు(రాజధాని), నాలుగు స్లీపర్ ఏసీ బస్‌లు, ఆరు నాన్ ఏసీ స్లీపర్ బస్సులు ఉన్నాయి. ఇందులో ఏసీ బస్సులన్నింటినీ ప్రత్యేకంగా తనిఖీ చేయించాం. ఏసీ బస్సుల నిర్వహణ కోసం ప్రైవేట్ టెక్నీషియన్‌ను నియమించాం. రీజియన్‌లోని అన్ని బస్సులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బంది ఎదురు కాకుండా పర్యవేక్షిస్తున్నాం.

సౌకర్యాలు కల్పిస్తున్నాం..

వేసవి సెలవులు, పోటీ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు ఉన్న నేపథ్యాన ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య ప్రస్తుతం మరింత పెరిగే అవకాశముంది. ఎవరూ ఇబ్బంది పడకుండా అన్ని బస్టాండ్లలో వాటర్ కూలర్లను ఏర్పాటు చేస్తున్నాం. అంతేకాక ఒక వాటర్ కూలర్‌ను అదనంగా సమకూర్చుకుని ఎక్కడైనా పనిచేయకపోతే అక్కడికి పంపిస్తున్నాం. ఇక దాతల సహకారంతో చలివేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నాయి జరుగుతున్నాయి. రద్దీగా ఉండే రిక్వెస్ట్ స్టాప్‌ల వద్ద కూడా ప్రయాణికుల కోసం తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

ఆదాయం పెరిగింది..

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో సంస్థకు ఆదాయం పెరిగింది. మహాలక్ష్మి పథకం రాక ముందు రోజుకు రూ.85 లక్షల నుంచి రూ.కోటి వరకు ఆదాయం సమకూరేది. ఇటీవల రూ.1.15 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఆదాయం నమోదవుతోంది. పండుగల సీజన్, వరుస సెలవులు ఉన్న సమయాన మరింత ఎక్కువగా వస్తోంది. ప్రయాణికుల డిమాండ్ మేరకు అదనంగా బస్సులు నడిపేందుకు అన్ని వేళలా సిద్ధంగా ఉంటున్నాం.



క్లుప్తంగా

మంత్రి పొన్నంను కలిసిన బోయినపల్లి



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కృష్ణమూర్తి

వైరా: వైరాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు బోయినపల్లి కృష్ణమూర్తి ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా బోయినపల్లి మాట్లాడుతూ ఇటీవలే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి పాటుపడాలని ఆయనకు మంత్రి సూచించారు.

విద్యార్థి వైద్యఖర్చులకు ఆర్థిక సాయం



విద్యార్థి నయాన్‌ను పరామర్శిస్తున్న ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు

ఏన్కూరు: అనారోగ్యంతో బాధపడుతున్న గురుకుల విద్యార్థి చికిత్స కోసం రూ.1,12,716 నగదు సమకూర్చిన పూర్వవిద్యార్థులు మానవత్వాన్ని చాటారు. ఏన్కూరు గురుకులంలో తూతకలింగన్నపేటకు చెందిన ఎస్.కే.నయాన్ ఆరో తరగతి చదువుతుండగా ఇటీవల జ్వరం వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో ఖమ్మంకు అక్కడి నుంచి హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తుండగా.. ఆయన తల్లిదండ్రుల వద్ద సరిపడా నగదు లేదని గురుకుల పూర్వ విద్యార్థులకు తెలిసింది. దీంతో దేశ, విదేశాల్లో స్థిరపడిన వారి నుంచి రూ.1,12,716 సేకరించి అందజేశారు. అలాగే, ఇదే పాఠశాలలో చదువుకున్న రాష్ట్ర మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు, ఐఆర్ఎస్ అధికారి లావుడ్యా జీవన్‌లాల్ హైదరాబాద్‌లో నయాన్ చికిత్స పొందుతున్న ఆస్పత్రి యజమాన్యంతో మాట్లాడారు. ఈమేరకు నయాన్ కోలుకుని ఆదివారం ఇంటికి చేరుకోగా ప్రిన్సిపాల్ టి శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థులు మోదుగు జోగారావు, అర్విసేని కృష్ణ, ఉపాధ్యాయులు పరామర్శించారు.

స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగావకాశాలు



సన్మానం అందుకున్న వారితో కోచ్, అసోసియేషన్ సభ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటే క్రీడాకారులకు ప్రభుత్వం కల్పించే రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగావకాశాలు ఉంటాయని ఖమ్మం అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ. గౌస్ తెలిపారు. ఇటీవల వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులను ఖమ్మంలోని మున్సిపల్ పార్క్‌లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం సన్మానించారు. ఈసందర్భంగా గౌస్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వపరంగా ఉద్యోగావకాశాలు ఉన్నందున.. యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎం.డీ.ఇబ్రహీం (ఏఈఈ, సీహెచ్.శివ(కానిస్టేబుల్), పి.లావణ్య(గ్రూప్ -4) తదితరులను సన్మానించగా ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్‌తో పాటు జునైద్, కిషోర్, రమణ, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

మడుపల్లి హైస్కూల్ హెచ్‌ఎం అరెస్ట్

మధిర: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన మడుపల్లి హైస్కూల్ హెచ్‌ఎం సాధు సమాధానంపై పోక్సో కేసు నమోదైన విషయం విదితమే. ఈ మేరకు ఆయనను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మధిర సీఐ మధు తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం




రాజేష్‌కు చికిత్స చేస్తున్న వైద్యులు

నేలకొండపల్లి: చిన్న మొదలైన వివాదంలో ఓ యువకుడిపై ఎదుటి వ్యక్తి దాడి చేయగా గాయాలయ్యాయి. మండలంలోని చెరువుమాధారానికి చెందిన రాజేష్, నర్సింహారావు మధ్య ఆదివారం రాత్రి వివాదం మొదలైంది. అది కాస్త పెరగడంతో రాజేశ్‌పై ఆగ్రహంతో నర్సింహారావు కత్తితో దాడి చేశాడు. మూడు చోట్ల పొడిచే ప్రయత్నం చేయగా కత్తి స్వల్పంగా కోసుకుంది. అయినా నర్సింహారావు దాడి చేస్తుండడంతో స్థానికులు అడ్డుకుని రాజేష్‌ను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తీసుకెళ్లారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

ప్రకృతి అందాలకు అడ్డా.. మోతెగడ్డ!

గోదావరి అందాలంటే తెలుగు ప్రజలకు గుర్తుకొచ్చేది ఉభయ గోదావరి జిల్లాలే. కానీ ఆ జిల్లాలకు దీటైన ప్రకృతి అందాలు అనేకం భద్రాద్రి జిల్లాలో ఉన్నా.. సరైన ప్రచారం, ప్రణాళిక లేక ఆదరణకు నోచుకోవడం లేదు. అందులో ఒకటి బూర్గంపాడు మండలంలోని మోతెగడ్డ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



గోదావరి తీరంలోని మోతెగడ్డ శివాలయం

రవాణా సౌకర్యం లేక కనిపించని ఆదరణ

- భద్రాచలానికి అతి సమీపంలోనే ద్వీపం
- గోదావరి నది మధ్యలో వీరభద్ర స్వామి ఆలయం
- అక్కడికి వెళ్లాలంటే మరబోట్లే మార్గం
- బోటింగ్ సౌకర్యం కల్పించాలంటున్న భక్తులు

మరబోట్లే ఏకైక దిక్కు..

గోదావరి నది ఎంత ఉధృతంగా ప్రవహించినా మోతెగడ్డ, అక్కడున్న శివాలయం మునిగిపోవు. అయితే వరద ఉధృతి కారణంగా జూన్ నుంచి నవంబర్ వరకు ఆలయానికి రాకపోకలు నిలిచిపోతాయి. మిగిలిన రోజుల్లో మరబోట్ల ద్వారా ఆలయానికి చేరుకునే వీలుంది. శివరాత్రి జాతర సందర్భంగా భక్తులు మరబోట్ల ద్వారానే ఇక్కడికి వస్తుంటారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భద్రాచలం నుంచి మోతెగడ్డ వరకు బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తే భక్తులతో పాటు పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంటుందని ఈ ప్రాంత వాసులు అంటున్నారు.

బోటింగ్ సౌకర్యం కల్పిస్తే..

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇక ఏపీలో ఉన్న పాపికొండలు, మారేడుమిల్లి, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్లేవారూ భద్రాచలం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. భద్రాచలం వచ్చే భక్తులు మాత్రం కేవలం రామచంద్రస్వామి దర్శనం చేసుకుని తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. ఇలా వచ్చే భక్తులు మరింత ఎక్కువ సమయం భద్రాచలంలో గడిపేందుకు వీలుగా విరివిగా టూరిజం ప్యాకేజీలు, ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శనకు తగిన ఏర్పాట్లు లేవు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో భద్రాచలంలోని పుష్కర ఘాట్ నుంచి మోతెగడ్డ వరకు బోటింగ్ సౌకర్యం కల్పిస్తే ఇటు భక్తులు, అటు పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుంది. తగినంత ఆదరణ లభిస్తే డిసెంబర్ నుంచి మే వరకు పాపికొండలు టూర్ ప్యాకేజీ తరహాలో మోతెగడ్డ దగ్గర బ్యాంబూ హట్స్, టెంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.

జిల్లాలో కిన్నెరసాని ఒక్కటే..

జిల్లాలో కేవలం కిన్నెరసాని డ్యామ్ దగ్గరే బోటింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో వందల మంది బోటింగ్ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాంటిది వేలాదిగా భక్తులు వచ్చే భద్రాచలంలో ఇప్పటి వరకు బోటింగ్ సౌకర్యం లేదు. ప్రస్తుతం బోటింగ్‌కు పర్యాటకుల నుంచి లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో ఇక్కడ పడవ ప్రయాణం అందుబాటులోకి తెస్తే 'శ్రీశైలం' తరహాలో ఆదరణ దక్కుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా భద్రాచలం నుంచి మోతెగడ్డ వరకు ఆధునిక బోట్లను ప్రయోగాత్మకంగా నడిపించేందుకు పర్యాటక శాఖ చొరవ చూపించాలని భక్తులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే..

భద్రాచలంలో గోదావరి తీరంలోని స్నానఘట్టాల నుంచి మోతెగడ్డ వరకు కనీసం చిన్న సైజు బోట్లు నడిపేందుకు నీటిలో అనువైన మార్గం, రేవు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని పర్యాటకులు, భక్తులు సూచిస్తున్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ మేరకు స్థానిక అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఆ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే భద్రాచలానికి వచ్చే భక్తులు, పర్యాటకులు మరింతగా పెరుగుతారు.

అచ్చం పట్టిసీమలా..



పశ్చిమ గోదావరి జిల్లాలోని పట్టిసీమ ప్రకృతి అందాలకు నెలవు. గోదావరి నది మధ్యలో చిన్న గుట్టపై ఉన్న శివాలయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు రావడమే కాదు.. అనేక సినిమాలను ఇక్కడ చిత్రీకరించారు. 80వ దశకంలోని జానకిరాముడు, స్వాతిముత్యం తదితర సూపర్‌హిట్ సినిమాల్లో ఈ ఆలయం కనిపిస్తుంది. అయితే అచ్చంగా పట్టిసీమ తరహాలోనే బూర్గంపాడు మండలం సారపాక నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మోతె గ్రామం వద్ద గోదావరి నది మధ్యలో మోతెగడ్డ ద్వీపం ఉంది. చుట్టూ నీళ్లు, ఇసుక మేటలు, రాళ్ల దిబ్బలు కనిపించే ఈ గుట్టపై భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం ఉంది. కాకతీయుల కాలంలో ఈ ఆలయం నిర్మించినట్టుగా చెబుతారు. శివరాత్రి రోజున ఇక్కడ జరిగే జాతరకు వేలాదిగా భక్తులు వస్తారు. ఆ తర్వాత ఇక ఎవరూ పట్టించుకోరు. భద్రాచలం సమీపంలోనే ఈ ఆలయం ఉన్నప్పటికీ తగినంత ప్రాచుర్యం మోతెగడ్డ వీరభద్రుడికి దక్కడం లేదు.

ఆస్తిపన్ను వసూళ్లలో ముందంజ

- కేఎంసీలో రూ.30 కోట్లు దాటిన వసూళ్లు
- చివరిరోజే రూ.2.11 కోట్ల ఆదాయం



ఖమ్మంలో పన్నుల వసూళ్లను పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ కమిషనర్, ఆర్ఓ

ఖమ్మంమయూరిసెంటర్: ఆస్తి పన్ను వసూళ్లలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బేష్ అనిపించుకున్నారు. ఆదివారంతో ముగిసిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.32.81 కోట్ల పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా రూ.30.80 కోట్లు వసూలయ్యాయి. కేఎంసీ పరిధిలోని మొత్తం 79,420 అసెస్‌మెంట్లకు గాను 52 వేలకు పైగా అసెస్‌మెంట్లకు సంబంధించిన ఆస్తిపన్ను వసూలైంది. ప్రభుత్వం 90 శాతం వడ్డీ రాయితీ ఇవ్వడం, అధికారులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పన్నులు వసూలు చేయగలిగారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక ప్రణాళికతో రెవెన్యూ అధికారులు, బిల్‌కలెక్టర్లు, ఇతర ఉద్యోగులతో బృందాలను ఏర్పాటు చేసి చెల్లింపుదారుల వద్దకు పంపించారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజైన ఆదివారం ఉదయం 7నుండి రాత్రి 9 గంటల వరకు పన్నులు వసూలు చేశారు. దీంతో ఈ ఒక్కరోజే అత్యధికంగా రూ.2.11 కోట్లు పన్నులు వసూలు కావడం విశేషం. 2022–23 ఆర్థిక సంవత్సరం చివరి రోజు రూ.కోటి వసూలు చేయగా, ఈసారి రూ.2కోట్లు దాటడంతో అధికారులు రికార్డు సృష్టించినట్లయింది. అంతేకాక గతేడాదితో పోలిస్తేఅధికంగా పన్ను వసూలు చేయడంతో కేఎంసీకి 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక సంఘం నిధులు పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ఆదివారం అర్ధరాత్రి వరకు పన్నుల వసూళ్లు ఆన్‌లైన్‌లో నమోదైతే ఆదాయం మరింత పెరిగే అవకాశముందని చెబుతున్నారు. ఇక చివరి రోజు రాష్ట్రంలోనే అత్యధికంగా పన్నులు వసూలు చేసిన కార్పొరేషన్‌గా కేఎంసీకి పేరు దక్కింది.

మున్సిపాలిటీల్లో ఇలా...

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆర్థిక సంవత్సరం చివరిరోజైన ఆదివారం గణనీయంగా పన్నులు వసూలయ్యాయి. అత్యధికంగా కొత్తగూడెంలో రూ.21.34లక్షలు వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. ఇక పాల్వంచలో రూ.10.44లక్షలు, ఇల్లెందులో రూ.7.63లక్షలు, మధిరలో రూ.6.89లక్షలు, సత్తుపల్లిలో రూ.3.57లక్షలు, మణుగూరులో రూ.3.11లక్షలు, వైరా మున్సిపాలిటీలో రూ.2.17లక్షల మేర ఆస్తి పన్నులు వసూలయ్యాయి.

అన్ని ఉద్యోగ సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేస్తాం..



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి, పక్కన ఏలూరి, రవీందర్, నాయకులు

టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఖమ్మంసహకారనగర్: ఉద్యోగులు, ఉపాధ్యాయులంతా ఐకమత్యంతో ముందుకెళ్లేలా..రాష్ట్రంలో పెద్ద సంఘంగా ఉన్న పీఆర్‌టీయూతో పాటు ఇతర సంఘాలను కలుపుకుని జేఏసీ ఏర్పాటు చేస్తామని గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు వెల్లడించారు. పీఆర్‌టీయూ జిల్లా నూతన కమిటీని ఖమ్మంలో ఆదివారం ఎన్నుకోగా రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌తో కలిసి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీజీవోస్, టీఎన్జీవోస్‌ను కలుపుకుని ముందుకెళ్తామని, కలిసికట్టుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావుతో పాటు చిత్తలూరి ప్రసాద్, పుట్లూరి వెంకటేశ్వరరెడ్డి, డి.వెంకటేశ్వరరావు, రత్నరాజు, హుస్సేన్, కట్ట శేఖర్, బ్రహ్మారెడ్డి, జయమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా యలమద్ది



యలమద్ది వెంకటేశ్వర్లు

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మోత్కూరి మధు ఉద్యోగ విరమణ చేయగా, ఆయన స్థానంలో యలమద్ది వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆయన ఖమ్మంలోని ఎన్నెస్పీ హైస్కూల్‌లో విధులు నిర్వర్తిస్తూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

మూడోసారి కూడా మోదీ సర్కారే..

- ఖమ్మంలోనూ విజయం సాధిస్తాం
- బీజేపీ రాష్ట్ర సంఘటన్ చంద్రశేఖర్‌జీ



మాట్లాడుతున్న చంద్రశేఖర్ జీ, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో మూడోసారి కూడా మోదీ సర్కార్ ఏర్పాటవుతుందని బీజేపీ రాష్ట్ర సంఘటన్ చంద్రశేఖర్‌జీ ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వివిధ వర్గాల వారి కోసం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. దేశంలో బీజేపీ 400పైగా స్థానాల్లో గెలవనుండగా, అందులో ఖమ్మం సీటు కూడా ఉంటుందని తెలిపారు. పార్టీ ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం కల్పిస్తే ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. ప్రతీ కార్యకర్త తానే అభ్యర్థిగా భావించి ప్రచారం చేయాలని కోరారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మార్తినేని ధర్మారావు మాట్లాడగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు శ్రీకాంత్, నంబూరి రామలింగేశ్వరావు, కిరణ్, నున్నా రవి, శ్యాంరాథోడ్, అల్లిక అంజయ్య, డీకొండ శ్యామ్, నర్సింహారావు, వీరుగౌడ్, అనంతు ఉపేందర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లారీలను దగ్ధం చేసిన మావోయిస్టులు

చర్ల: ఇనుప ఖనిజం తరలిస్తున్న నాలుగు లారీలను మావోయిస్టులు దగ్ధం చేసిన సంఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో శనివారం రాత్రి జరిగింది. నారాయణపూర్ జిల్లా చోటేడోంఘర్ పోలీస్ స్టేషన్‌కు కేవలం 500 మీటర్ల దూరంలో ఆమ్డ మైన్స్ నుంచి ముడి ఇనుప ఖనిజాన్ని తరలిస్తున్న లారీలు నిలిపి ఉండగా శనివారం రాత్రి మావోయిస్టులు అక్కడకు చేరుకున్నారు. డీజిల్ ట్యాంకులను పగులగొట్టి టైర్లపై చల్లి నిప్పంటించడంతో మంటలు చెలరేగి లారీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కాగా ఇనుప ఖనిజం తరలింపును మావోయిస్టులు కొంతకాలంగా వ్యతిరేకిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే మావోయిస్టులు ఈ దుర్ఘటనకు పాల్పడటంతో పోలీసులను కలవరపాటుకు గురిచేస్తోంది.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

- అడవి పందుల వేటకు వెళ్లగా ప్రమాదం



అనిల్ (ఫైల్)

మధిర: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని ఇల్లెందులపాడు సమీపాన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బలవంతపు అనిల్(26) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఖమ్మంపాడు లిఫ్ట్‌కు విద్యుత్ లైన్లు వెళ్లే ఫీడర్ ప్రాంతాన అడవి పందుల వేటకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో స్నేహితులు గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా, వారు వెళ్లి ఆటోలో అనిల్‌ను మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగానే ఆయన మృతి చెందాడు. నాలుగేళ్ల క్రితం ఖమ్మం ప్రాంతానికి చెందిన సుకన్యను అనిల్ ప్రేమ వివాహం చేసుకోగా, వీరికి రెండేళ్ల కుమార్తె, ఏడు నెలల కుమారుడు ఉన్నాడు. ఇటీవల తన కుమారుడికి అన్నప్రాసన నిర్వహించిన అనిల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గత పాలకుల లోపంతోనే నీటిఎద్దడి

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు, పక్కన నాయకులు

నేలకొండపల్లి: పదేళ్ల అధికారంలోకి ఉన్న బీఆర్ఎస్ అసమర్థత కారణంగానే జిల్లాలో నీటి ఎద్దడి ఏర్పడిందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆరోపించారు. నేలకొండపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనాలోపాలతో జిల్లాలో తాగు, సాగు నీటికి ఇక్కట్లు ఎదురవుతున్నాయని తెలిపారు. అయినా లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీగా ఏనాడూ రైతుల సమస్యలను పట్టించుకోని నామా నాగేశ్వరరావుకు ఇప్పుడు రైతులు గుర్తొచ్చారని తెలిపారు. ఆయన ఫ్యాక్టరీలో చెరుకు రైతులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ ఇప్పుడు రైతుల సమస్యలపై మాట్లాడడం హాస్యాస్పదమని పేర్కొనానరు. కాగా, జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ప్రజామద్దతు కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక ఆసత్య విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఏదిఏమైనా లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ రమ్య, నాయకులు శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, బొందయ్య, వెంకన్న, మైశా శంకర్, కొడాలి గోవిందరావు, మారుతి కోటి, కడియాల నరేష్, ఉండమోదుగుల శ్రీను, యడవల్లి హుస్సేన్‌గౌడ్ పాల్గొన్నారు.

పూలసాగుతో లాభాల పంట



రైతులకు పుస్తకాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

దమ్మపేట: గిరిజన ప్రాంతాల రైతులు సంప్రదాయ పంటలకు తోడు పూల తోటలు సాగు చేస్తే అధిక లాభాలు సాధించొచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. హైదరాబాద్‌లోని పూల పరిశోధన స్థానం ఆధ్వర్యాన దమ్మపేట మండలం పూసుకుంటలో గిరిజనులకు పూల పంటల సాగుపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీజన్ల వారీగా బంతి పూలతో పాటు ఇతర పూల తోటలు సాగు చేస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. రైతులకు మార్కెట్లకు వెళ్లకుండా తోటల వద్దకే కొనుగోలుదారులు వస్తారని తెలిపారు. అనంతరం రైతులకు రూ.వెయ్యి విలువైన విత్తనాలు, సాగుకు సంబంధించిన మెళకువలతో రూపొందించిన పుస్తకాలు, జీవన ఎరువులను ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రణీత్‌కుమార్, డాక్టర్ విజయకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి సందీప్, ఏఈఓ రవీంద్ర, ప్రశాంత్, చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి.. ఇరువర్గాల ఘర్షణ

కారేపల్లి: ప్రేమ పెళ్లి విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన కారేపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని మేకలతండా గ్రామంలో చెందిన ఒకే సామాజికవర్గానికి చెందిన మేజర్లు అయిన యువతీ, యువకుడు పది రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆతర్వాత ఊరికి రావడంతో ఇరువర్గాల కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా యువతీయువకులు మేజర్లు కావటంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. అయితే, వారం రోజుల క్రితం సదరు యువతి తాను కాపురానికి వెళ్లనంటూ తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. దీంతో యువకుడి తల్లిదండ్రులు పెద్దమనుషుల సమక్షాన పంచాయితీ నిర్వహించగా ఫలితం లేక ఆదివారం కారేపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఇంతలోనే స్టేషన్ సమీపాన ఘర్షణకు దిగగా కలగజేసుకున్న పోలీసులు తరిమివేశారు. ఆపై కారేపల్లి సినిమాహాల్ సెంటర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో పెద్దమనుషుల సమక్షాన పంచాయితీ నిర్వహిస్తుండగా మరోమారు ఇరువర్గాల వారు కర్రలతో పరస్పరం దాడులకు దిగగా పోలీసులు చేరుకుని చెదరగొట్టారు. కాగా, పరస్పరం దాడులకు దిగి ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించిన ఇరువర్గాల వారిపై బ్లూ కోట్ కానిస్టేబుల్ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కారేపల్లి ఎస్ఐ రాజారాం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ముదిగొండ మండలంలోని మేడేపల్లి గ్రామానికి చెందిన బొంత యల్లయ్య(55), బొంత వీరబాబు బైక్‌పై నిత్యావసర సరుకుల కోసం నేలకొండపల్లి బయలుదేరారు. మండలంలోని గువ్వలగూడెం వద్దకు రాగానే ముజ్జుగూడెంకు చెందిన ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో యల్లయ్యకు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనతో పాటు ఉన్న వీరబాబుకు సైతం తీవ్ర గాయాలు కాగా నేలకొండపల్లి చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట నాగరాజు తెలిపారు.

తలసేమియాపై విజయం

- హెచ్ఎల్ఏ హాఫ్ మ్యాచ్‌తో విజయవంతంగా చికిత్స
- 'సంకల్ప' సహకారంతో చిన్నారికి కొత్త జీవితం



షణ్ముక్‌తో సంకల్ప సంస్థ బాధ్యులు, చిన్నారులు

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియా వ్యాధి నివారణకు బోన్‌మ్యారో చికిత్సను తొలిసారి హాఫ్ మ్యాచ్ హెచ్ఎల్ఏతో చేయించి విజయం సాధించామని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి పి.రవిచందర్ తెలిపారు. మణుగూరుకు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు కె.షణ్ముక్ 9 తలసేమియాతో బాధపడుతుండగా సంకల్ప సంస్థ సహకారంతో బెంగళూరులో అతి ఖరీదైన బోన్‌మ్యారో చికిత్సను అతి తక్కువ ఖర్చుతో చేయించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం ఖమ్మం రాగా, రితన్య ఆస్పత్రిలోని తలసేమియా డే కేర్ సెంటర్‌లో రవిచందర్, డాక్టర్ డి.నారాయణమూర్తి వివరాలు వెల్లడించారు.

సక్సెస్ రేట్ తక్కువ...

తలసేమియా నుంచి విముక్తి కోసం చేసే బోన్ మ్యారో చికిత్స ఖరీదైందని రవిచందర్, నారాయణమూర్తి తెలిపారు. హెచ్ఎల్ఏ వంద శాతం మ్యాచ్ అయినా విజయవంతం అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. కానీ రాష్ట్రంలోనే తొలిసారి షణ్ముక్‌కు సగం మేర మ్యాచ్‌తోనే బోన్ మ్యారో చికిత్స విజయవంతమైందని చెప్పారు. తద్వారా ప్రతీ ఇరవై రోజులకోసారి రక్తం ఎక్కించాల్సిన పనిలేదని, పదినెలల పాటు బయట వ్యక్తులను కలవకుండా జాగ్రత్తగా కాపాడితే సరిపోతుందని తెలిపారు. సంస్థతో పాటు ఇతర దాతల చేయూతతో బెంగళూరులోని సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో అతి తక్కువ ఖర్చుకు ఈ చికిత్స చేయించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, ఎన్.ఉపేందర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B- ఫార్మసీ, D.Ed(TTC), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc(నర్సింగ్), GNM. Ph: 8866977112, 339 [HA-13637]

Real Estate

PLOT FOR SALE

■ ఖమ్మం 3 టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్, గాంధీ నగర్‌లో 275 గజాల స్థలం అమ్మకానికి కలదు. వివరాలకు సంప్రదించండి. సెల్ : 83281 02880. [M-1185005]

Services

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252718]

Wanted

■ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మా సర్వీస్ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్ & శానిటరీ, A/c టెక్నీషియన్స్ వెంటనే కావలెను. సంప్ర॥ 8074489455. [M-1185008]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185009]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులనుపేషెంట్స్‌ను చూసుకొనుటకువర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-799859]

■ Wanted Optometrist and Duty Doctors (MBBS/PharmD) OT Technician. Grace General Hospital, Thanikella, Khammam. Ph. : 8367355355, 8367466466. [M-1185013]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957, 9705444182
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.